# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
24-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక:150

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# కొండా ఫ్యామిలీకి నో ఛాన్స్!



మురళికి అపాయింట్మెంట్ ఇవ్వని డిప్యూటీ సీఎం భట్టి

మరోవైపు ప్రధాన అనుచరుల అరెస్టు

వదులుకునేందుకు కాంగ్రెస్ హై కమాండ్ నిర్ణయం

తెలంగాణ కాంగ్రెస్ లో మంత్రి కొండా సురేఖ ఫ్యామిలీ ఎపిసోడ్ రోజుకో మలుపు తిరుగుతోంది. కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యల వెనుక కొండా దంపతుల పాత్ర ఉందని హై కమాండ్ కు క్లారిటీ వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే పార్టీలో ఇప్పుడు కొండా కుటుంబం ఒంటరి అయ్యేలా పరిస్థితి దాపురించింది. కానీ ఇప్పుడు పార్టీలో ఒక వర్గం మద్దతు తమకు ఉందన్న కోణంలో ప్రాజెక్టు చేసే పనిలో ఉన్నారు కొండా కుటుంబం.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

2లో

## లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైన సీఎం

అమెరికా పర్యటన రద్దు..

అండగా నిలిచిన ఖర్గేకు సీఎం రేవంత్ కృతజ్ఞతలు

కేంద్రం అనుమతి నిరాకరించడంతో అమెరికా పర్యటన రద్దు

ఈ అంశంలో మద్దతిచ్చిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు ప్రత్యేక కృతజ్ఞతలు

రాజకీయ కారణాలతోనే పర్యటనను అడ్డుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపణ

హైదరాబాద్ చేరుకున్నాక పూర్తి వివరాలు వెల్లడిస్తానని ప్రకటన

2లో

## మెత్తబడిన చిన్నారెడ్డి!

షోకాజ్ నోటీసుపై లిఖితపూర్వక వివరణ

పార్టీ లైన్ దాటి వెళ్లలేదని ప్రస్తావన

స్థానిక నాయకత్వం ఒంటెద్దు పోకడలపై అంటూ ఆవేదన

వేటు భయంతోనే వెనక్కి?




క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిన్నారెడ్డి వెనక్కి తగ్గారా? వేటు తప్పదని భావించి

# బీసీ కార్డు ఫలిస్తుందా?!

టిపిసిసి క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ

బలహీన వర్గాల మహిళను అంటూ ప్రస్తావన

వేటు వేసిన మరుక్షణం తిరుగుబాటుకు నిర్ణయం




తెలంగాణ మంత్రి కొండా సురేఖ రాజకీయ అడుగులు ఎటు? మంత్రివర్గం నుంచి తొలగిస్తే ఆమె ఏం చేస్తారు? పార్టీ వేటు వేస్తే ఏ పార్టీలో చేరుతారు? ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్ లో దీనిపైనే ప్రచారం నడుస్తోంది. కొద్ది రోజులుగా తెలంగాణ కాంగ్రెస్ లో కొండా సురేఖ ఫ్యామిలీ కాక రేపిన సంగతి తెలిసిందే.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** సురేఖ అసంతృప్తి వ్యాఖ్యలు చేయగా.. ఆమె కుమార్తె సుస్మిత పటేల్ మరో అడుగు ముందుకు వేసి తెలంగాణ సీఎం రేవంత్ ను టార్గెట్ చేసుకున్నారు. టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత విమర్శలు చేశారు. దీంతో పార్టీ క్రమశిక్షణ కమిటీ సురేఖకు నోటీసులు జారీ చేసింది. అయితే దీనిపై పెద్దగా స్పందించని సురేఖ... తిరిగి అదే క్రమశిక్షణ కమిటీకి లేఖ రాయడం సంచలనంగా మారింది.

**బీసీ సెంటిమెంట్..**

అయితే ముప్పేట తనపై జరుగుతున్న దాడిని గమనించారు కొండా సురేఖ. అత్యంత వ్యూహాత్మకంగా బీసీ సెంటిమెంట్,

- మిగతా 2వ పేజీలో

## తెలంగాణలో క్రెడిట్ వార్!

రేషన్ కార్డుల పై సీఎం రేవంత్, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఫోటో

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర అభ్యంతరం

ప్రధాని మోడీ ఫోటో వేయాలంటూ డిమాండ్




**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో అధికార కాంగ్రెస్, బిజెపి మధ్య కొత్త రాజకీయ యుద్ధానికి తెరలేచింది. కొత్త రేషన్ కార్డుల పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఫోటోలు మాత్రమే ముద్రించడం పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

2లో

## హైడ్రా తరహాలో కొత్త ఆపరేషన్!

### ఈసారి రైస్ మిల్లర్లు టార్గెట్

ధాన్యం ఎగవేత, డిఫాల్టర్ల పై గురి పెట్టేందుకు ప్రత్యేక టీం

పోలీస్ శాఖ నుంచి పౌరసరఫరాల శాఖకు 28 మంది సుశిక్షితులైన సిబ్బంది

తెలంగాణలో ముమ్ముందు సంచలనాలు




**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలకు దిగుతోంది. నిబంధనలు ఉల్లంఘిస్తున్న రైస్ మిల్లర్లపై కమాండోల ప్రయోగం చేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం దాన్యం మిల్లింగ్, కష్టం మిల్డ్ రైస్ అప్పగింతలో నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిపై దృష్టి పెట్టింది. ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయల ధాన్యాన్ని, నిధులను ఎగవేస్తున్న రైస్ మిల్లర్లపై పౌరసరఫరాల శాఖ అత్యంత కఠినమైన

2లో

## వైసీపీకి షాక్!



మద్యం కుంభకోణంలో మాజీ మంత్రి అరెస్ట్

హైదరాబాదులో అదుపులోకి తీసుకున్న ఈడి

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** మద్యం కుంభకోణం కేసులో మళ్లీ అరెస్టులు ప్రారంభం అయ్యాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో భారీ మద్యం కుంభకోణం జరిగిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కొనసాగుతోంది. ఇంకోవైపు ఈడి అరెస్టుల పర్వానికి దిగింది.

2లో

## సమ్మె వద్దు.. సమస్యలు పరిష్కరిస్తాం

### ఆటో, క్యాబ్ డ్రైవర్లకు మంత్రి పొన్నం భరోసా

నేటి అర్ధరాత్రి నుంచి తలపెట్టిన బంద్‌ను విరమించాలని ఆటో డ్రైవర్లకు మంత్రి పొన్నం విజ్ఞప్తి

ఛార్జీల సవరణపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ

ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడి

పాత ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోలు కొంటే ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తామన్న మంత్రి



ఇవాళ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన నిరవధిక బంద్‌ను విరమించుకోవాలని ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లకు తెలంగాణ

## కారుమూరి అరెస్ట్.. ప్రభుత్వ కక్షసాధింపు

విడదల రజని ఆగ్రహం

మద్యం రవాణా కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అక్రమ అరెస్టు

ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని మండిపడ్డ విడదల రజని

బీసీ నేతలను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని ప్రభుత్వ తీరుపై ఆరోపణ

టీడీపీ హయాంలోని మద్యం స్కామ్ నుంచి దృష్టి మరల్చేందుకే ఈ కుట్ర అని విమర్శ

కారుమూరిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్




## లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు
# తిరుగు ప్రయాణమైన సీఎం



తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం 'రాజకీయ కారణాలతో' అనుమతి నిరాకరించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ క్లిష్ట సమయంలో తనకు బలమైన మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. లండన్‌లో తాను చేపట్టాల్సిన అధికారిక సమావేశాలు, కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే, కేంద్ర విదేశాంగ శాఖ తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించినందున, తొలుత అనుకున్న ప్రకారం బోస్టన్‌కు వెళ్లకుండానే తన పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. "గడిచిన మూడు రోజులుగా లండన్‌లో నాకు లభించిన మద్దతుకు ఎంతో సంతోషంగా ఉంది. ఈ అంశంలో నాకు మద్దతుగా నిలిచిన పార్టీకి, నాయకులకు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ధన్యవాదాలు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాత సంబంధిత అన్ని విషయాలపై మాట్లాడతాను" అని రేవంత్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

# హైడ్రా తరహాలో కొత్త ఆపరేషన్!

అస్త్రాన్ని ప్రయోగించింది. రాష్ట్ర పోలీస్ విభాగానికి చెందిన అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎలైట్ బలగాలైన గ్రేహౌండ్స్, ఆక్టోపస్ నుంచి ఎంపిక చేసిన 28 మంది సుశిక్షితులైన సిబ్బందిని.. పౌరసరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ అండ్ విజిలెన్స్ విభాగానికి డిప్యూటేషన్ పై అటాచ్ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

**రైస్ మిల్లర్లది కీలక పాత్ర..**

ప్రభుత్వ రేషన్ సరఫరా లో రైస్ మిల్లర్లది కీలక పాత్ర. ప్రభుత్వం రైతుల నుంచి కనీస మద్దతు ధరకు సహకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తారు మిల్లర్లు. తిరిగి ప్రభుత్వ నిల్వలకు బియ్యం అందించాల్సిన బాధ్యత కూడా వారిదే. అయితే కొందరు మిల్లర్లు ప్రభుత్వ ధాన్యాన్ని రీసైకిలింగ్ చేయడం, బహిరంగ మార్కెట్లో అమ్ముకోవడం లేదా నిర్దిష్ట గడువులోగా ప్రభుత్వానికి బియ్యం అప్పగించలేదు. చాలామంది డిఫాల్ట్ అవుతున్నారు. అంతటితో ఆగకుండా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025 - 26లో ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం దాదాపు 40 వేల కోట్ల రూపాయలు వెచ్చించి.. రికార్డు స్థాయిలో 154 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. ఈ పరిస్థితుల్లో ఇంతటి భారీ ప్రజాధనాన్ని కాపాడేందుకు.. ఎగవేతకు పాల్పడుతున్న రైస్ మిల్లర్ల పై సర్కార్ నిఘా పెట్టింది.

**సంచలన నిర్ణయమే..**

ఏకంగా పోలీస్ వ్యవస్థల్లో నుంచి ఇలా సిబ్బందిని తీసుకోవడం మాత్రం సంచలనమే. అయితే పోలీస్ శాఖకు ఈ పౌరసరఫరాలు అనేవి భిన్నంగా ఉంటాయి విధులు. అందుకే ఈ కమాండో బృందానికి శిక్షణ ఇస్తున్నారు. వీరి వ్యూహాత్మక ఆపరేషన్ అనుభవం, ఆకస్మిక దాడులు నిర్వహించే నైపుణ్యంతో రాష్ట్రవ్యాప్తంగా డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులపై మెరుపు దాడులు చేపట్టేందుకు రంగంలోకి దిగుతున్నట్లు తెలుస్తోంది. కచ్చితంగా హైడ్రా తరహాలో.. ఈ కమాండో ఆపరేషన్ సైతం సరికొత్త సంచలనాలకు తెరతీసే అవకాశం ఉంది.

# కొండా ఫ్యామిలీకి నో ఛాన్స్!

ఈ పరిస్థితుల్లో కొండా మురళి వేసిన ఎత్తుగడ బెడిసి కొట్టింది. ప్రభుత్వంలో అత్యంత కీలకమైన నేతగా ఉన్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కలిసి.. పార్టీలో తమకు ఆయన పూర్తి మద్దతు ఉందని సంకేతాన్ని హై కమాండ్ కు, ప్రత్యర్థులకు పంపాలని గట్టి ప్రయత్నాలు చేశారు మురళి. కానీ ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీ అంతర్గత సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆయనకు అపాయింట్మెంట్ ఇచ్చేందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది.

**అధిష్టానం సీరియస్..**

ప్రస్తుతం పార్టీ హై కమాండ్ కొండా కుటుంబం పై సీరియస్ గా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. ఈ పరిస్థితుల్లో వారితో కలిసేందుకు కూడా ఎవరు ఇష్టపడడం లేదు. ఈ వివాదంలో అనవసరంగా తల దూర్చడం, ఒక వర్గానికి మద్దతుగా నిలిచినట్లు కనిపించడం మంచిది కాదన్న భావనతోనే డిప్యూటీ సీఎం భట్టి ఈ నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కీలక నేతల భేటీకి కూడా అవకాశం లేకుండా పోతోంది. కనీసం మద్దతు ఇచ్చే వారు కూడా కరువవుతున్నారు. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే మాత్రం కొండా వర్గానికి పెద్ద రాజకీయ ఎదురు దెబ్బ అని చెప్పవచ్చు.

**సెటిల్మెంట్లపై ఫోకస్..**

మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కొండా కుటుంబానికి సంబంధించిన సెటిల్మెంట్ వ్యవహారాలపై పోలీసుల దర్యాప్తు కూడా అనూహ్య వేగం పుంజుకుంది. మంత్రి సురేఖ మాజీ ఓఎస్డి సుమంత్ డ్రైవర్ను పోలీసులు శనివారం ఉదయమే అదుపులోకి తీసుకునే అరెస్టు చేశారు. పాత వివాదాలు, ఫోన్ సంభాషణలు, తాజా పరిణామాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమాచారం రాబట్టేందుకు పోలీసులు ఈ అరెస్టు జరిపినట్లు తెలుస్తోంది. ఈ అరెస్టులతో కొండా ఫ్యామిలీ మరింత బేజారు అవుతున్నట్లు సమాచారం.

**వ్యతిరేకులు అధికం..**

పైగా కాంగ్రెస్ పార్టీలో కొండా ఫ్యామిలీకి పెద్దగా మద్దతు ఇచ్చేవారు లేరు. వారి వైఖరి పై వ్యతిరేకంగా ఉన్న వారే అధికం. ఒకవేళ మద్దతుగా మాట్లాడాలనుకున్న వారు సైతం ముందుకు రాని పరిస్థితి. ఇదే సమయంలో ప్రభుత్వ పెద్దల నుంచి అపాయింట్మెంట్ లభించకపోవడం.. మరోవైపు సొంత వారి అరెస్టు వారిని కలవరపెడుతోంది. కాంగ్రెస్ హై కమాండ్ కొండా సురేఖ విషయంలో ఒక నిర్ణయానికి వచ్చేసిందని.. సాగనంపడమే తరువాయి అనే టాక్ ఉంది. ఇప్పటికే పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది కాంగ్రెస్ పార్టీలో. క్రమశిక్షణ కట్టు దాటుతోంది. నేతలు వీధుల్లోకి వస్తున్నారు. పార్టీ కట్టు దాటుతున్నారు. ఈ క్రమంలో మంత్రి కొండా సురేఖ పై గట్టి చర్యలు తీసుకోవడం ద్వారా పార్టీ శ్రేణులకు గట్టి సంకేతాలు పంపాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# బీసీ కార్డు ఫలిస్తుందా?!

**(మొదటి పేజీ తరువాయి)**

సామాజిక న్యాయం అనే వస్త్రాలను బయటకు తీశారు. క్యాబినెట్ లో ఉన్న సీనియర్ బీసీ మహిళా నాయకురాలు అయిన తనపై.. దాదాపు 20 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉసిగొల్పి వేధింపులకు గురి చేస్తుంటే.. పార్టీ అధిష్టానం నిశ్శబ్దంగా వీక్షించడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తన కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం. కుటుంబ సంబంధాలు ఉన్నంత మాత్రాన మరొకరి అభిప్రాయాలకు నన్ను బాధ్యురాలు చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం అని మరోసారి స్పష్టం చేశారు. అయితే తాను ఒక క్యాబినెట్ మంత్రిగా ఉంటూ.. సీఎం రేవంత్ పై తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను మాత్రం ఆమె ఖండించడం లేదు. బీసీ కార్డును ప్రయోగించి.. తనపై చర్యలు తీసుకుంటే బీసీ వర్గాల్లో వ్యతిరేకత వస్తుందని సంకేతాన్ని హైకమాండ్కు పంపించారు. పైగా తనను ఎవరూ ఏం చేయలేరని చెప్పే ప్రయత్నం కూడా చేశారు.

**రాజకీయ పార్టీల విముఖత..**

ఒకవేళ కాంగ్రెస్ పార్టీ వేటు వేస్తే కొండా సురేఖ ఏ పార్టీలో చేరుతారు అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. అయితే ఇప్పటికే ఆమె చాలా పార్టీలు తిరిగారు. గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో పని చేశారు. ఆ పార్టీ నాయకత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తర్వాత కెసిఆర్ పంచన చేరారు. అక్కడ మంత్రి పదవి అందుకొని అదే కెసిఆర్ ను వ్యతిరేకించారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి రేవంత్ రెడ్డి ద్వారా మంత్రి పదవి అందుకున్నారు. ఇప్పుడు ఆయనపై సైతం తిరుగుబాటు చేశారు. వివాదాస్పద ముద్ర



ఉండడంతో కొండా ఫ్యామిలీ పట్ల తెలంగాణ రాజకీయ పార్టీలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

**ఉపేక్షించే అవకాశం లే..**

ఇంకోవైపు సురేఖ బీసీ కార్డు ఎంతవరకు పనిచేస్తుంది అనేది ఇప్పుడు పొలిటికల్ వర్గాల్లో జరుగుతున్న చర్చ. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసుకున్నారు సురేఖ కుమార్తె. సీఎం సోదరుడికి భూముల కేటాయింపులపై కూడా వ్యాఖ్యానించారు. అమ్ముడు పోయారు అంటూ టిపిసిసి చీఫ్ పై విరుచుకుపడ్డారు.. అందుకే ఆమె విషయంలో బీసీ ఎమ్మెల్యేలు సైతం ఆగ్రహంగా ఉన్నారు. బ్రిటన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న రేవంత్ ఈ అంశంపై సీరియస్ గా చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే కాంగ్రెస్ హై కమాండ్ తీవ్ర నిర్ణయం తీసుకుంటే.. అదే స్థాయిలో నష్టం చేయాలన్న ఆలోచనలో కొండా వర్గం ఉంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# వైసీపీకి షాక్!

అందులో భాగంగా ఈరోజు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఈడీ అధికారులు హైదరాబాదులో అరెస్టు చేశారు. ఇప్పటికే పలువురి అరెస్టు జరిగింది. గతంలో ఇదే కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ కూడా రెస్ట్ అయ్యారు. ఆయనతో పాటు మిగతా నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఈరోజు కారుమూరిని హైదరాబాదులోని కొండాపూర్ నివాసంలో ఈడి అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

**భారీ కుంభకోణం..**

వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వమే నేరుగా మద్యం దుకాణాలు నడిపింది. అప్పట్లోనే వేలకోట్ల రూపాయలు అక్రమ మార్గంలో మద్యం కుంభకోణం ద్వారా పక్కదారి పట్టించారన్న ఆరోపణలు వచ్చాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. ఈ కేసులో కీలక నేతలుగా ఉన్న పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప, ధనుంజయ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి లాంటి వారి అరెస్టు జరిగింది. అంతకుముందు ఈ కేసులో సూత్రధారిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి అరెస్ట్ కూడా జరిగింది. మరోవైపు ఇదే కేసులో నిందితుడిగా ఉన్న విజయసాయిరెడ్డి అప్రూవర్ గా మారినట్లు ఆరోపణలు వచ్చాయి. అందుకే ఆయన అరెస్టు జరగలేదని ప్రచారం జరిగింది. అయితే ఇదంతా ఆర్థిక కోణంలో జరగడంతో ఈడి ఎంట్రీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

**మద్యం రవాణా లోనే..**

అయితే తాజాగా మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్టు వెనుక మద్యం రవాణా అంశం కీలక పాత్ర పోషించింది. అప్పట్లో మద్యం రవాణా కోసం ఇచ్చిన టెండర్లలో సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ ముందు పెట్టి మీరు అక్రమ దందా నడిపించినట్లు ఈడి గుర్తించింది. ఈ వ్యవహారంలోనే మాజీమంత్రి కారుమూరి అరెస్టు జరిగినట్లు తెలుస్తోంది. అయితే కారుమూరి అరెస్టుపై ఈడి ఎంతవరకు అధికారికంగా ప్రకటన చేయలేదు. అయితే విచారణ అనంతరం ఆరుమూరిని కోర్టులో హాజరు పరిచే అవకాశం ఉంది. మద్యం కుంభకోణం లో మళ్లీ అరెస్టుల పర్వం ప్రారంభం కావడంతో వైసీపీలో ప్రకంపనలు మొదలయ్యాయి. తదుపరి అరెస్టు ఎవరిది అనేదానిపై ప్రధానంగా చర్చ నడుస్తోంది.

# మెత్తబడిన చిన్నారెడ్డి!

వెనక్కి తగ్గడం మేలన్న నిర్ణయానికి వచ్చారా? ఎన్నికలకు ముందు ఏదో ఒక నిర్ణయం తీసుకోవచ్చని ఆలోచన చేస్తున్నారా? అందుకే కొద్ది రోజులపాటు వేచి చూసి దూకుడు పెంచాలని భావిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్లో చిన్నారెడ్డి వ్యాఖ్యలు చిచ్చురేపిన సంగతి తెలిసిందే. స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డిని ఉద్దేశించి చిన్నారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. మొన్నటి ఎన్నికల్లో టికెట్ కొనుక్కున్నారు అంటూ ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆధారాలతో సహా హై కమాండ్ కు ఫిర్యాదు చేశారు. చిన్నారెడ్డి పై చర్యలు తప్పవన్న ప్రచారం నేపథ్యంలో.. కాస్త వెనక్కి తగ్గుతూ క్రమశిక్షణ కమిటీకి లేఖ రాశారు చిన్నారెడ్డి.

**లిఖితపూర్వక వివరణ..**

చిన్నారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీస్ జారీ చేసింది. లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ తరుణంలో లిఖితపూర్వకంగా చిన్నారెడ్డి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. తాను పార్టీ లైన్ దాటలేదని స్పష్టం చేశారు. ఎలాంటి తప్పు మాట్లాడలేదన్నారు. పార్టీ జెండా మోస్తున్న క్షేత్రస్థాయి కార్యకర్తల తీవ్ర ఆవేదనను మాత్రమే బాధ్యతాయుతమైన నాయకుడిగా అధిష్టానం దృష్టికి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలను ప్రస్తావించారు. స్థానిక ఎమ్మెల్యే వ్యవహార శైలిని తప్పుపట్టారు. ఏళ్ల తరబడి కాంగ్రెస్ జెండాను మోస్తూ కష్టకాలంలో నిలబడిన అసలైన కార్యకర్తలను, నేతలను పూర్తిగా విస్మరిస్తున్నారని ఆరోపించారు. స్థానిక నాయకత్వం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల వల్ల పార్టీ క్యాడర్లో తీవ్ర అసంతృప్తి, నైరాస్యం పేరుకుపోయాయని.. ఒక సీనియర్ నాయకుడిగా వారి బాధను, మనోభావాలను వెలిబుచ్చడం పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడం కిందకు రాదని చెప్పుకొచ్చారు.

**కాంగ్రెస్కు వీర విధేయుడిని..**

మరోవైపు తన సుదీర్ఘ రాజకీయ చరిత్రను.. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన వైనాన్ని ప్రస్తావించారు. ఏనాడు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదని గుర్తు చేశారు.. బహిరంగంగా కానీ.. అంతర్గతంగా కానీ.. పార్టీపై కానీ.. పార్టీ పెద్దలపై కానీ ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని వివరించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, కేడార్ ఆత్మగౌరవాన్ని కాపాడడం కోసమే మాట్లాడానని.. తన వ్యాఖ్యలను పార్టీకి వ్యతిరేకంగా చిత్రీకరించడం సమంజసం కాదని స్పష్టం చేశారు. తనకు జారీచేసిన షోకాజ్ నోటీసులు తక్షణమే ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మొత్తానికైతే చిన్నారెడ్డి వెనక్కి తగ్గినట్లే అని కనిపిస్తోంది.

## కారుమూరి అరెస్ట్.. ప్రభుత్వ కక్షసాధింపు

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును అక్రమంగా అరెస్టు చేశారంటూ ఆ పార్టీ నేత, మాజీ మంత్రి విడదల రజని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని, దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ అరాచకాలకు ఇది పరాకాష్ఠ అని ఆమె ఆరోపించారు. లేని కేసును సృష్టించి వైసీపీ నేతలను ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని విమర్శిస్తూ తాడేపల్లిలో ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం రవాణాలో అక్రమాలు జరిగాయనే నెపంతో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును హైదరాబాద్‌లో అక్రమంగా అరెస్టు చేశారని రజని పేర్కొన్నారు. బీసీ నేత అయిన కారుమూరి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని, కొద్ది రోజుల క్రితం ఆయన కుమారుడు సునీల్‌ను కూడా అరెస్టు చేశారని, ఇప్పుడు ఆయనను అరెస్టు చేయడాన్ని పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇద్దరు రిటైర్డ్ ఉన్నతాధికారులను కూడా అన్యాయంగా జైల్లో పెట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## సమ్మె వద్దు.. సమస్యలు పరిష్కరిస్తాం

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మెల ద్వారా సమస్యలు పరిష్కారం కావని, చర్చలతోనే సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, వారు చర్చలకు సహకరించాలని కోరారు. హుస్నాబాద్‌లో పర్యటించిన సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆటో కార్మికుల ప్రధాన డిమాండ్లలో ఒకటైన ఛార్జీల సవరణపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలో 2015 నుంచి ఆటో ఛార్జీలు పెరగలేదన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, పెరుగుతున్న నిర్వహణ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ఛార్జీల పెంపుపై అధ్యయనం చేసేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కమిటీలో రవాణా శాఖ అధికారులతో పాటు ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులకు కూడా స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, ఆటో కార్మికుల కోసం ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కేబినెట్ ఇప్పటికే నిర్ణయం తీసుకుందని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ బోర్డు కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా మార్గదర్శకాలను త్వరలోనే ఖరారు చేస్తామని పేర్కొన్నారు. గతంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలను ఎంత సీరియస్‌గా తీసుకుని పరిష్కరించామో, అదే రీతిలో ఆటో కార్మికుల సమస్యలనూ పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆటో డ్రైవర్ల ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకుని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు. పాత డీజిల్, పెట్రోల్ ఆటోలను స్క్రాప్ చేసి కొత్త ఎలక్ట్రిక్ ఆటోలను కొనుగోలు చేసే డ్రైవర్లకు ప్రభుత్వ సహకారం అందిస్తామన్నారు. అలాగే, పాత వాహనాలను గ్రీన్ ఎనర్జీలోకి మార్చుకునేందుకు (రెట్రోఫిట్టింగ్) త్వరలోనే ఒక కొత్త పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు.

# తెలంగాణలో క్రెడిట్ వార్!

**(మొదటి పేజీ తరువాయి)**

వారి ఫోటోలతో పాటు ప్రధాని నరేంద్ర మోడీ ఫోటోలు కూడా వేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద రాష్ట్రానికి అవసరమైన మెజారిటీ బియ్యాన్ని, నిధులను కేంద్ర ప్రభుత్వమే సమకూరుస్తున్నప్పుడు.. ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో లేకుండా కేవలం రాష్ట్ర నేతల ఫోటోలు మాత్రమే ముద్రించడం.. రాజకీయ కుట్రగా అభివర్ణిస్తున్నారు కిషన్ రెడ్డి. ఇలానే వ్యవహరిస్తే మహిళా పొదుపు సంఘాల ద్వారా కేంద్రమే నేరుగా రేషన్ పంపిణీ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరే అవకాశం ఉంది.

**ఎవరి వాదన వారిదే..**

ఈ మొత్తం వ్యవహారంలో క్రెడిట్ వార్ స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తూ వస్తోంది. ఈ విషయంలో అదనపు ఆర్థిక భారాన్ని తామే భరిస్తున్నామని.. అందుకే ఆ క్రెడిట్ పూర్తిగా తమకే ఉండాలని వాదిస్తోంది. ఇంకోవైపు తెలంగాణలోని సుమారు 55 లక్షలకు పైగా కుటుంబాలకు కేంద్రం వాటా కిందనే ఉచిత బియ్యం అందుతోంది. నిధులు కేంద్రానికి అయితే ప్రచారం మాత్రం రాష్ట్ర ప్రభుత్వాన్నిదా అని బిజెపి నేతలు ప్రశ్నిస్తున్నారు. ఆహార భద్రత కల్పించడంలో ఇరు ప్రభుత్వాల భాగస్వామ్యం ఉన్నప్పటికీ రాజకీయ సమీకరణలను దృష్టిలో పెట్టుకొని.. రాజకీయ లబ్ధి పొందేందుకు ఇరుపక్షాలు తాపత్రయపడుతున్నాయి.

**నిశితంగా గమనిస్తున్న గులాబీ పార్టీ..**

తెలంగాణలో ఒక రకమైన రాజకీయ సమరం కనిపిస్తోంది. కాంగ్రెస్ గులాబీ పార్టీల మధ్య సంప్రదాయ రాజకీయ యుద్ధం ఉంది. కానీ అదే కాంగ్రెస్, బిజెపిల మధ్య మాత్రం క్రెడిట్ కోసం వార్ నడుస్తోంది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో తమ పాత్ర అంటూ తమ పాత్ర ఉంది అని ఇరు రాజకీయ పక్షాలు గట్టిగానే తలపడుతున్నాయి. ఈ క్రమంలో రాజకీయ చలిమంట కాచుకుంటుంది గులాబీ పార్టీ. వాస్తవానికి ప్రజాధనంతో, పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయి. అలా ఇస్తున్న సంక్షేమ పథకాల పత్రాలపై అసలు ఏ రాజకీయ నాయకుడి ఫోటోలు ఉండకూడదు అనేది రాజ్యాంగ నిపుణులు, మేధావుల మాట. కార్డులపై కేవలం లబ్ధిదారుడి కుటుంబ వివరాలు, క్యూ ఆర్ కోడ్ వంటి సాంకేతిక అంశాలు మాత్రమే ఉండాలన్న మార్గదర్శకాలు ఉన్నాయి. కానీ అధికార పార్టీలు మాత్రం పొలిటికల్ మైలేజీ కోసం తాపత్రయపడుతున్నాయి.

# ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 12వేలు ఇవ్వాలి.. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య**





**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఆటో డ్రైవర్ల తో పాటు రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాంపల్లి మండల కేంద్రంలో ఆది వారం ఆటో డ్రైవర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిఐటియు పాల్గొన్న జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చదువుకొని ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక అప్పులు సభ్యులు చేసుకుని ఆటో కొనుక్కొని నడుపుతున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ద్వారా ప్రమాద బీమా ఆరోగ్య బీమా పిల్లలకు స్కాలర్షిప్స్ పెన్షన్ లాంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి స్కీం లో భాగంగా ఆటో డ్రైవర్ల ఉపాధి కోల్పోవడంతో సంవత్సరానికి 12 వేలు జీవన భృతి ఇస్తానన్న హామీని వెంటనే నిలబెట్టుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 2019 మోటార్ వాహన చట్టం కార్మికుల మెడమీద ఉరితాడు లాగా మారిందని విమర్శించారు. డీజిల్ పెట్రోల్ ధరలు స్పేర్ పార్ట్స్ ధరలు పెరగడంతో ఆటో కార్మికుల బతుకులు అగమ్యగోచరంగా మారుతున్నాయని వీరి నాదుకోవడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో రంగ కార్మికుల పొట్టలు కొట్టే విధంగా ఎలక్ట్రానిక్ ఆటోలను ప్రవేశపెట్టి గమ్యానికి చేర్చే పద్ధతిని మానుకోవాలని ఓలా ఉబర్ లాంటి గుత సంస్థలను నిషేదించాలని కోరారు. ఈనెల 24 నుండి జరిగే ఆటోల రాష్ట్ర వ్యాప్త బందులో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకురాలు ఎదుళ్ళ సునీత, ఆటో యూనియన్ నాయకులు ఆవుల వెంకటయ్య, బుషి పాక వెంకటేశ్వర్లు, నారపాక విజయ్, పగడాల అంజయ్య, బైరగోని అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# మారథాన్‌లో పాల్గొన్న వారికి ఉచిత మొక్కల పంపిణీ

**తెలంగాణ వనమహోత్సవం-2026లో భాగంగా హెచ్ఎండిఏ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం కార్యక్రమం**







హైదరాబాద్ (క్రైమ్ మిర్రర్): తెలంగాణ వనమహోత్సవం-2026లో భాగంగా పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు హెచ్ఎమ్‌డిఏఅర్బన్ ఫారెస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఉచిత మొక్కల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. సెంట్రల్ గురుద్వారా సాహిబ్ శతాబ్ది మారథాన్-2026 సందర్భంగా పీవీ మార్గ్‌లోని హెచ్ఎమ్‌డిఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మారథాన్‌లో పాల్గొన్న సుమారు 5,000 మందికి 15 రకాల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. మొక్కలు నాటడం, వాటి సంరక్షణ ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ గురుద్వారా సాహిబ్ గౌలిగూడ ప్రబంధక్ కమిటీ చైర్మన్ ఎస్. రాజేందర్ సింగ్, హార్టికల్చర్ అధికారి వి.జి. సుందర్, ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రణీత్ కౌర్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి సీతారాములు, ఇతర హెచ్ఎమ్‌డిఏ అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా సంజీవయ్య పార్క్‌లో ఎన్‌బిఆర్‌సి ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన మరో రన్ కార్యక్రమంలోనూ హెచ్ఎమ్‌డిఏ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం పాల్గొని 1,000 మందికి పైగా రన్‌లో పాల్గొన్న వారికి ఉచితంగా మొక్కలను పంపిణీ చేసింది. తెలంగాణ వనమహోత్సవం-2026 సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, పౌరులను మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణలో చురుకుగా భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు హెచ్ఎమ్‌డిఏ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం తెలిపింది.

## నాంపల్లిలో గీత పారాయణం



**క్రైమ్ మిర్రర్ నాంపల్లి:** నాంపల్లి మండల కేంద్రంలో కర్నాటి జయప్రకాష్ ధర్మపత్ని భాగ్యమ్మ స్వగృహంలో గీత భక్త బృందం ఆధ్వర్యంలో సామూహిక గీతా పారాయణం నిర్వహించారు. సామూహిక గీత పారాయణంలో నాంపల్లి మండలం లోని భక్తులు భక్తిశ్రద్ధలతో గీత పారాయణం చేశారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అన్నప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో సంగీపు పరంధావులు కుక్కడం యాదయ్య ఏ రెడ్ల నర్సిరెడ్డి శంకరప్ప, చెన్నయ్య, కర్నాటి శ్రీహరి, మహిళలు తదితర భక్తులు పాల్గొన్నారు.

**క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు**
**కంటెంట్ రైటర్లు కావలెను**
**సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం**



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి. ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
**9393929595**

## మున్సిపల్ కార్మికులపై దాడి చేసిన వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి

**తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులపై దాడి చేసిన వ్యక్తిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపురంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న జైపాల్ రెడ్డి వెంటనే మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని అక్కడ ఉన్న కార్మికులను పరామర్శించి ఘటన వివరాలను తెలుసుకున్నారు. ఈ ఘటనపై కార్మికులు కృష్ణ, అలువేలమ్మ, వెంకటమ్మ, యాదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతిరోజూ ఉదయం నుంచే పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాంటి కార్మికులపై దాడి చేయడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. పారిశుద్ధ్య పనులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయాలి తప్ప కార్మికులపై దాడి చేయడం సరికాదని స్పష్టం చేశారు. బస్తీల్లో విధులు నిర్వహిస్తున్న సమయంలో మద్యం సేవించి పారిశుద్ధ్య కార్మికులపై దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి సీఐని కోరినట్లు తెలిపారు. దీనిపై పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు జి. జాషువా, జె. మహేందర్, కే. సంగీత, వి. రాజు, కార్మికులు సబిత, రాములమ్మ, ఉషారాణి, జె. యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



## పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

**మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి**

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని హైదరాబాద్ రోడ్, బీడీఎల్ చౌరస్తా వద్ద పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే కాలే యాదయ్యను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పోచమ్మ దేవి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్‌పర్సన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, శంకర్పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి ,కౌన్సిలర్లు గణేష్, ఆనంద్, అశోక్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ చేకూర్తి గోపాల్ రెడ్డి, పిల్లిగుండ్ల గ్రామ సర్పంచ్ స్వాతి కాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్రశాంత్, భాస్కర్ రెడ్డి, నాయకులు రఘునందన్ రెడ్డి, శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో బీడీఎల్ చౌరస్తా పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి.

## జాబ్ కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యం



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధి, బడంగ్పేట్ ఎస్బిఆర్ ఎంక్లేవ్ కాలనీకి చెందిన నాంపల్లి శ్రీనాథ్, తండ్రి సూర్య ప్రకాష్, వయసు 30 సంవత్సరాలు, జూన్ 2026 జాబ్ వెతుక్కుంటున్నాడని ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి అప్పటి నుండి ఇప్పటి వరకు తిరిగి ఇంటికి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడం జరిగిందని, ఈ వ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిసినట్లయితే లేదా ఎక్కడైనా కనిపించినట్లయితే 8712662646, 8712534662 ఈ ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని మీర్పేట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ తెలిపారు.

## శంషాబాద్‌లో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం

**డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై అభిప్రాయాలు వెల్లడించిన జితేందర్ మెరుగు**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్‌లో నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు జితేందర్ మెరుగు పాల్గొని, కొత్త డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై తన అభిప్రాయాలను వెల్లడించారు. పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో కార్యకర్తల పాత్ర తదితర అంశాలపై కార్యక్రమంలో చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కర్ణాటక ఎమ్మెల్సీ మోహన్ జీ, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయిని కలుసుకుని మాట్లాడే అవకాశం లభించడం ఆనందంగా ఉందని జితేందర్ మెరుగు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చేసిన కృషి, సమిష్టిగా పనిచేయడం ద్వారా సాధించిన మంచి ఓట్ల గురించి వారికి వివరించినట్లు తెలిపారు. అలాగే నేక్నాంపూర్, మణికొండ డివిజన్లలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, స్థానికంగా పార్టీ బలోపేతానికి ఉన్న అవకాశాలపై కూడా తన అభిప్రాయాలను వివరించినట్లు జితేందర్ మెరుగు తెలిపారు. కార్యకర్తల సమన్వయంతో పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.



# డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికకు సంఘటన్ సృజన్ అభియాన్

## క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యం: పి.వి. మోహన్





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా ఏఐసీసీ సూచనల మేరకు సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ పి.వి. మోహన్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ మండలం తండుపల్లి గ్రామంలోని మనస్వి గార్డెన్స్‌లో రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సంస్థాగత సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పి.వి. మోహన్ ముఖ్య అతిథిగా హాజరై నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా పి.వి. మోహన్ మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణతో పాటు అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగడం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని మరింత పటిష్టం చేసి, ప్రజలకు చేరువైన బలమైన సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యమని తెలిపారు. డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికలో క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు పూర్తి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. అందరినీ కలుపుకుని పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపించగల నాయకత్వాన్ని పారదర్శక విధానంలో ఎంపిక చేస్తామని పి.వి. మోహన్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ అబ్జర్వర్లు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.డీసీసీ అధ్యక్ష పదవి కోసం పోటీలో ఉన్న పలువురు నాయకులు సమావేశానికి హాజరై పార్టీ అభివృద్ధి, సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు. వారిలో ఎన్. ధనుంజయ, జి. శేఖర్ యాదవ్, కృష్ణారెడ్డి, సంజయ్ యాదవ్, జలపల్లి నరేందర్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైలారం సులోచన, డివిజన్ అధ్యక్షులు దూడల వెంకటేష్ గౌడ్, సామా ఇంద్రపాల్ రెడ్డి, సి. మహేందర్ ముదిరాజ్, బొబ్బిలి శేఖర్ ముదిరాజ్, ప్రేమ్ గౌడ్, పి. శ్రీధర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మహమ్మద్ గౌస్, మహమ్మద్ షౌకత్, నరేందర్, మెరుగు జితేందర్, దుర్గేష్ యాదవ్, కోటేష్ గౌడ్, రవి నాయక్, రాము నాయక్, మహమ్మద్ ఖలీల్, చందు తదితరులు ఉన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖర్గేను అవమానించడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు అవమానం

### జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ అంతారం నరేష్ కుమార్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు మల్లికార్జున ఖర్గేను అవమానించేలా జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ అంతారం నరేష్ కుమార్ తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజా ప్రతినిధుల పట్ల వివక్షాపూరిత చర్యలకు ఎలాంటి స్థానం ఉండకూడదని ఆయన పేర్కొన్నారు. మల్లికార్జున ఖర్గే దేశానికి సేవలందిస్తున్న సీనియర్ నాయకుడని, ఆయనను కించపరిచే విధంగా వ్యవహరించడం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదని నరేష్ కుమార్ అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం వంటి భారత రాజ్యాంగ ప్రాథమిక విలువలను అవమానించడమేనని పేర్కొన్నారు. కులం, మతం, ప్రాంతం అనే తేడాలు లేకుండా దేశంలోని ప్రతి పౌరుడికి సమాన గౌరవం లభించాలని అన్నారు. అంటరానితనం, కుల వివక్ష వంటి భావజాలాన్ని రాజ్యాంగం తిరస్కరించిందని, అలాంటి ఆలోచనలను ప్రోత్సహించే చర్యలను ప్రతి ప్రజాస్వామ్యవాది ఖండించాలని పిలుపునిచ్చారు. కుల వివక్షకు తాము వ్యతిరేకమని భావిస్తే, ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని ప్రజలకు స్పష్టమైన సందేశం ఇవ్వాలని బీజేపీ నాయకత్వాన్ని నరేష్ కుమార్ డిమాండ్ చేశారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత గౌరవం, రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని అన్నారు. వ్యక్తులు మారవచ్చు.. ప్రభుత్వాలు మారవచ్చు.. కానీ రాజ్యాంగ విలువలు, సమానత్వం, ప్రజాస్వామ్య గౌరవం ఎప్పటికీ నిలవాలి అని అంతారం నరేష్ కుమార్ పేర్కొన్నారు.

# సాతంరాయిలో బీఆర్ఎస్ బస్తీ బాట



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** బీఆర్ఎస్ శంషాబాద్ 118 డివిజన్ ఆధ్వర్యంలో సాతంరాయి బస్తీలో బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వివిధ కాలనీల్లో పర్యటించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్, మంచినీటి సరఫరా, రోడ్లు, శ్మశానవాటిక తదితర సమస్యలపై ప్రజల నుంచి వివరాలను సేకరించారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని బీఆర్ఎస్ శంషాబాద్ 118 డివిజన్ అధ్యక్షులు కొల్లన్ ప్రదీప్ రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను కేవలం తెలుసుకోవడమే కాకుండా, వాటి పరిష్కారం కోసం అధికారులను ప్రశ్నిస్తూ నిరంతరం కృషి చేయడమే బస్తీ బాట కార్యక్రమం లక్ష్యమని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ జనార్ధన్ యాదవ్, రాహుల్ అప్ప, లీగల్ సెల్ అధ్యక్షుడు జయకృష్ణ గౌడ్, రాష్ట్ర నాయకులు మంచాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు సాల్వేంద్రి వెంకటరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాపచెట్టు యాదగిరి, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ (టిల్లు), ఉపాధ్యక్షుడు వెంకటేశ్ ముదిరాజ్, సెక్రటరీ పరమేష్ యాదవ్, యూత్ వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ యాదవ్, కపిల్ యాదవ్, ప్రభాకర్, రాజు, వాజిద్, రవి, జగదీష్ గౌడ్, భిక్షపతి యాదవ్, శ్రీనివాస్, వై. శ్రీనివాస్, ప్రశాంత్, కిట్టు తదితరులు పాల్గొన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బస్తీ బాట కార్యక్రమం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.



# సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలి

## ప్రజా సమస్యలను గుర్తించి బలమైన పోరాటాలు నిర్మించాలి: రాగల్ల ఉపేందర్ మాదిగ



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ మండల కమిటీల జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి చదువుకున్న యువతతో ఎమ్మార్పీఎస్ కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ గ్రామ పరిధిలో ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల మండల నాయకుల సమావేశం మండల ఇన్‌చార్జి కొత్తూరి రమేష్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, అణగారిన వర్గాల ఆర్థిక అభివృద్ధి కోసం నిరంతరం పోరాడాలని అన్నారు. కుల వివక్ష, మత దురహంకారం, సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణం కోసం ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. కుల వ్యవస్థ కారణంగా అణగారిన వర్గాలు పేదరికంలోనే కొనసాగుతున్నాయని, దోపిడీ, పీడన, అసమానతలు లేని సమాజ నిర్మాణానికి ఉద్యమాలు అవసరమని అన్నారు. గ్రామస్థాయిలో ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేయాలని, నాయకులు నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే గ్రామాల్లో పర్యటించి కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని అనుబంధ సంఘాల కమిటీలను కూడా ఏర్పాటు చేయాలని, రాజకీయ పార్టీలకు సంబంధం లేని చదువుకున్న యువతను కమిటీల్లో భాగస్వామ్యం చేయాలని కోరారు. సెప్టెంబర్ 5లోపు అన్ని గ్రామ, మండల కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేసి సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే జాతీయ మహాసభకు సిద్ధం కావాలని రాగల్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు మాదిగలతో పాటు పేద, అణగారిన వర్గాల భవిష్యత్తు కోసం ఉద్యమాన్ని విస్తృతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహా మాదిగ, సీనియర్ నాయకులు మంగళారం రత్నం మాదిగ, రాచమల్ల చిట్టిబాబు మాదిగ, మున్సిపల్ అధ్యక్షుడు చిన్నగండు భాస్కర్ మాదిగ, మండల కన్వీనర్ నిఖిల్ మాదిగ, రాచమల్ల రాజు మాదిగ, ఎంఎంఎస్ కన్వీనర్ జ్యోతి మాదిగ, పోతుగళ్ల రాజు మాదిగ, రమేష్ మాదిగతో పాటు వివిధ గ్రామాల బాధ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# 25 నుంచి 'వైరా'లో టీడబ్ల్యూజేఎఫ్ పాదయాత్ర

**జర్నలిస్టుల ఇండ్ల స్థలాల యాత్రకు విశేష స్పందన**

**పాలేరు నియోజకవర్గ ప్రజానీకానికి కృతజ్ఞతలు**

**27, 29 తేదీల్లో సత్తుపల్లి, మధిరలో పాదయాత్ర**

**షెడ్యూల్ విడుదల చేసిన టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ - హెచ్ 2843 ఆధ్వర్యంలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం చేపట్టిన పాదయాత్ర కు పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా బ్రహ్మరథం పట్టినందుకు టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి అక్కడి జర్నలిస్టులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, వివిధ వర్గాల ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న పాదయాత్రలో భాగంగా ఈనెల 25న వైరా, 27న సత్తుపల్లి, 29న మధిర నియోజకవర్గాల్లో పాదయాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఖమ్మంలోని ఇందిరానగర్ లో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ, పాదయాత్ర సభ్యుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ పాదయాత్ర అటు ప్రభుత్వాలకు కానీ, ఇటు ఏ రాజకీయ పార్టీలకు కానీ వ్యతిరేకం కాదని పునరుద్ఘాటించారు. ఇది కేవలం ప్రభుత్వాలు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేయడానికి మాత్రమేనని స్పష్టం చేశారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు లో అమర జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన పాదయాత్రకు నియోజకవర్గ వ్యాప్తంగా బ్రహ్మరథం పట్టారని తెలిపారు. ఆ స్ఫూర్తితో మిగతా నియోజకవర్గాల్లోనూ పాదయాత్రను విజయవంతం చేయాల్సిందిగా జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. యూనియన్లకు అతీతంగా జర్నలిస్టులు తరలివచ్చి పాదయాత్రకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. అలాగే ఆయా పార్టీలు, ప్రజా సంఘాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాదయాత్రకు సంఘీభావం తెలపాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

**వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల షెడ్యూల్...**

- ఇప్పటికే పాలేరు నియోజకవర్గంలో యాత్ర ముగిసిన నేపథ్యంలో తదుపరి కొనసాగే వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల పాదయాత్ర షెడ్యూల్ ను జిల్లా కమిటీ విడుదల చేసింది.
- 25వ తేదీ వైరా నియోకార్గంలోని కారేపల్లి మండల కేంద్రంలో ఉదయం 9 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి నేరుగా కామేపల్లి, ఏన్కూరు, వైరా మండల కేంద్రాల మీదుగా కొనసాగి కొనిజర్లలో ఆరోజు పాదయాత్ర ముగుస్తుందన్నారు.
- 27న సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడలో పాదయాత్ర ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఆరోజు ఉదయం 9 గంటలకు తల్లాడ మండల కేంద్రంలో ప్రారంభమయ్యే పాదయాత్ర కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి మీదుగా వేంసూరు మండల కేంద్రంలో ముగుస్తుందన్నారు.
- 29న మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండల కేంద్రంలో ఉదయం 9 గంటలకు యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. అక్కడి నుంచి నేరుగా మధిర, బోనకల్, చింతకాని, మండల కేంద్రాల మీదుగా యాత్ర సాగి ముదిగొండ లో ముగుస్తుందని వివరించారు. ఖమ్మం నియోజకవర్గం లో పాదయాత్ర తేదీని త్వరలో వెల్లడిస్తామన్నారు. ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించే పాదయాత్రను జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా ఖదీర్, శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కమిటీ చేపట్టే యాత్రకు యూనియన్ రాష్ట్ర నాయకులు సైతం తరలివచ్చి ఈ యాత్రను ముందుకు తీసుకువెళ్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, సహాయ కార్యదర్శి జక్కంపూడి కృష్ణ, టీబీజేఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవి కిరణ్, స్టేట్ ఈసీ మెంబర్ టిఎస్ చక్రవర్తి, కౌన్సిల్ మెంబర్ నలుబోల మధుశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు దగ్గుబాటి మాధవరావు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరకొప్పుల రాంబాబు, పవన్ కుమార్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# సభ్యుల ఆర్థిక చేయుతకు నిబంధనల మేరకు మరింత కృషి

### సత్యసాయి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ అధ్యక్షుడు పగిడిమర్రి సూర్యనారాయణ

### వ్యవస్థాపక సలహారుడు గద్దె యాదగిరి ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ రూ.2 లక్షలు

### గరిష్ట రుణ పరిమితి రూ.5 లక్షలకు ప్రతిపాధనకు 26వ వార్షిక సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆమోదం







**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాటేదాన్ డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్ లో సత్య సాయి పొదుపు సంఘం సభ్యులకు మరింత ఆర్థిక చేయుతనందించడానికి నిబంధనల మేరకు కృషి చేయనున్నట్లు సత్యసాయి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ అధ్యక్షుడు పగిడిమర్రి సూర్యనాయణ తెలిపారు.మొండి బకాయిదారు నుంచి రుణాల వసూళ్ళకు న్యాయ సహాదారుడి నియమకాన్ని చేపట్టాలని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం శుభ పరిణామంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆదివారం మార్కండేయనగర్ కాలనీలోని సత్యసాయి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ 26వ వార్షిక సర్వసభ్య సమావేశం సంఘ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సభలో వార్షిక నివేధిక ప్రవేశపెట్టి , ఆ కాపీలను సభ్యులకు అందజేశారు. అనంతరం వార్షిక నివేధిక చదివి వినిపించి, సభ్యుల నుంచి వచ్చిన అభ్యతరాలు, అనుమానాలను నివృత్తం చేశారు. దాంతో మహా సభలో సభ్యులు గడిచిన ఆర్థిక సంవత్సరం సంఘం నిర్వాహణ లావాదేవిలు, ఆదాయ, వ్యయాల ఆడిట్ రిపోర్టులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతనం అధ్యక్షుడు పగిడిమర్రి సూర్య నారాయణ మాట్లాడుతూ 20 మంది సభ్యలతో ప్రారభమై సత్యసాయి పొదుపు సంఘం ప్రస్తుతం 670 మంది పొదుపు సభ్యలకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 1వ తేదీ 2025 నాటికి రూ.5 కోట్ల 13 లక్షల92 వేల 260 రూపాయల ప్రారంభ నిల్వలావాదేవిలతో ప్రారంభమైన సంఘ నిర్వాహణ ఈ ఏడాది మరో రూ.55.86 లక్షల ఆర్థిక వృద్ధి సాధించి రూ.5 కోట్ల 69 లక్షల,78 వేల 772 రూపాయల టర్రోవర్‌ను 31 మార్చి 2026 నాటికి సాధించినట్లు పేర్కొన్నారు. అంతకు ముందు వ్యవస్థాపక సలహారుడు గద్దె యాదగిరి సభ దృష్టికి తీసుకువచ్చిన రూ.5 లక్షల సరళీకృత చెల్లింపుల(ఎల్ఆర్ఎస్) పథకం, రుణ మంజూరీ రూ.5 లక్షల గరిష్ట పరిమితి ప్రతిపాధనల పై సభలో సుదీర్ఘంగా చర్చ కొనసాగింది. అనంతరం గరిష్ట రుణ పరిమితి రూ.5 లక్షలకు పరిమితం చేయడంతో పాటు ఎల్ఆర్ఎస్ ప్రస్తుతం ఉన్న లక్ష రూపాయల పరిమితిని రూ.2 లక్షలకు పెంచుతూ ప్రవేశపెట్టిన ప్రతిపాధనను సభ్యులు ఆమోదించారు. మొండి బకాయిదారులు సంఘానికి చెల్లించాల్సిన రుణాల మొత్తం జాబితా వార్షిక నివేధికలో ఆ పూర్తి వివరాలతో సభ్యులకు తెలిసేలా ముద్రించాలన్న ప్రతిపాధనను సభ్యులు ఆమోదించారు. అలాగే ముఖ్య సలహాదారులు ఏర్వ సత్యనారాయణ, గద్దె క్రిష్ట, కోట జగదీష్, పదవీ విరమణ చేసే సభ్యులకు వారు రుణం పొందినప్పుడు చెల్లించిన ఎల్ఆర్ఎస్ మొత్తాన్ని ఏలాంటి క్లేమ్ లేని సభ్యులకు తిరిగి చెల్లించాలనే ప్రతిపాదనను కూడా సభ్యులు ఆమోదిస్తూ పదవీ విరమణ పొందే సభ్యులకు సంఘం గ్రాంట్‌గా రూ.1116 అందజేయాలని తీర్మాణించారు. అలాగే గతంలో తీర్మాణించిన మేర చేపట్టనున్న సత్యలసాయి కళ్యాణ మండపం నిర్మాణ వ్యయం ఎంత, ఆ పనులకు కొటేషన్‌లు పిలిచారా..? అన్న సభ్యుల ప్రశ్నను స్వాగతించిన పాలక వర్గం దేవాలయం వద్ద రిటర్నింగ్ వాల్ నిర్మాణం కోసం చేస్తున్న ప్రయాత్నాలు ప్రణాళిక రూపం దాల్చాయని, టెండర్ అనంతరం ఆ పనులు పూర్తి అయిన తరువాత నిర్మాణ పనులు ప్రారంభించే ముందు అయ్యే ఖర్చుల పై పాలక వర్గం చర్చించి,కళ్యాణ మండప నిర్మాణ కాంట్రాక్టర్ ఎంపిక ప్రక్రియ చేయనున్నట్లు పాలకవర్గం వెల్లడించింది. వేదవ్యాస్ అండ్ అసోసియేట్స్, చార్టర్డ్ అకౌంటెంట్స్ నివేధికను ఆడిటర్ వెంకటేష్ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో పగిడిమర్రి వాసు, వీడెం రమేష్, సంఘం ఉపాధ్యక్షుడు మునగపాటి విష్ణు, ప్రధాన కార్యదర్శ కోట శ్యామ్ కుమార్, సంయుక్త కార్యదర్శ శిరందాసు నరేందర్, కోశాధికారి కోట పవన్ కుమార్ పాకవర్గం సభ్యులు కైరంకొండ శంకర్, కర్నాటి శ్రీనివాస్, గంజి ధనంజయ్, బాత్కు విజయ్ కుమార్, బోనకుర్తిరాము, పూల పద్మమ్మ, గంజి నాగమణి, సంఘం అకౌంటెంట్ శ్రీరామ్ రాజు తోపాటు పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

# విద్యా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలి

### ఏఐఎస్ఎఫ్ రాజేంద్రనగర్ మండల 10వ మహాసభలో సామిడి వంశీ వర్ధన్ రెడ్డి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ సీపీఐ పార్టీ కార్యాలయం ఏఆర్ దేవరాజ్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ రాజేంద్రనగర్ మండల 10వ మహాసభను నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి, మాజీ యువజన సంఘం నాయకుడు కన్యగారి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాసభకు వంశీ వర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం ఏఐఎస్ఎఫ్ దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు నిర్వహిస్తూ గొప్ప పోరాట చరిత్రను కలిగి ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా విధానాల వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా రంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణను ప్రోత్సహించడం సరికాదని పేర్కొన్నారు. పెరుగుతున్న ఫీజుల భారాన్ని తగ్గించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకోకుండా విద్యార్థి సంఘాలతో చర్చించి విధానాలను రూపొందించాలని సూచించారు. రాజేంద్రనగర్ మండల పరిధిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ, ఉద్యమాల్లో విద్యార్థుల భాగస్వామ్యంపై మహాసభలో చర్చించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ రాజేంద్రనగర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా డి. శివ సాయి రామ్, అధ్యక్షురాలిగా కె. ప్రత్యూష, సహాయ కార్యదర్శులుగా జె. సాయి తేజ, డి. లక్ష్మీనారాయణ దత్తు, ఉపాధ్యక్షులుగా జె. రుత్విక్, ఎం. సాయి తేజ రావు, జి. నరోత్తం, సంయుక్త కార్యదర్శిగా డి. ప్రవీణ్ కుమార్ తదితరులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ రాజేంద్రనగర్ మండలంలో ఏఐఎస్ఎఫ్‌ను మరింత బలోపేతం చేయాలని మహాసభ పిలుపునిచ్చింది. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ఉచిత నాణ్యమైన విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదల, ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతం కోసం రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యమాలు చేపడతామని వంశీ వర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జె. ఆనంద్ గౌడ్, భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కన్నగారి లక్ష్మి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి జె. విజయ్ ఆనంద్ గౌడ్, మండల కార్యాలయ కార్యదర్శి జి. సత్యం, సీపీఐ మండల శాఖ కార్యదర్శులు జె. సదానంద్ గౌడ్, కే. వాణి శ్రీరాములు సాబీరు, ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎండి. సలీం, సయ్యద్ కాజా, ఈ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ వద్ద కంటైనర్ బోల్తా..

### హైదరాబాద్--బెంగళూరు హైవేపై భారీ ట్రాఫిక్ జామ్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల వద్ద పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్--బెంగళూరు జాతీయ రహదారిపై ఓ కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడింది. కంటైనర్ రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు మూడు గంటలుగా వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన వాహనాల్లో చిన్నారులు, మహిళలు అవస్థలు పడ్డారు. ఈ ట్రాఫిక్ జామ్‌లో బీజేపీ ఎంపీ డీకే అరుణ కూడా చిక్కుకున్నారు. ఆమె వాహనం కూడా చాలాసేపు ట్రాఫిక్‌లోనే నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కంటైనర్‌ను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు ప్రయత్నాలు కొనసాగించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.







# శ్రావణ మాసం సందర్భంగా ఘనంగా కావడి యాత్ర

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అత్తాపూర్‌లోని అంబియన్స్ పోర్ట్ కాలనీ నుంచి గంగా జలంతో పవిత్రమైన కావడి యాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు గంగా జలాన్ని కావడిలో తీసుకుని చిన్న అనంతగిరి శివాలయం, రాంబాగ్‌కు చేరుకున్నారు. అనంతరం పరమశివునికి గంగా జలంతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మ్యాడం రామేశ్వర్ రావు, జిల్లా కార్యదర్శి సాబాద విజయ్ కుమార్, ఎస్.బి. హరినాథ్, అరవింద్ అగర్వాల్, గణేష్ గుప్త, దీపక్ ధర్మేంద్ర అగర్వాల్, ఓం ప్రకాష్, పంకజ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు శివనామస్మరణతో యాత్రను కొనసాగించి స్వామివారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆదర్శప్రాయుడు ఈ ఉపాధ్యాయుడు






**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** బోధన చేయడం వృత్తిగా, రక్తదానం చేయడం ప్రవృత్తిగా మలచుకుని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం శ్రీరామ్ నగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న షేక్ అల్లావలి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తూనే, ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలుస్తున్నారు. ప్రతి సంవత్సరం గాంధీ జయంతి, ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదానం చేయడం ఈయన అలవాటుగా మార్చుకున్నారు. ఆదివారం మెయినాబాద్ ఏబీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిలాద్ బ్లడ్ డొనేషన్ క్యాంపులో మరోసారి రక్తదానం చేసి మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

# ప్రజాప్రాణాలతో చెలగాటమా...

# నియంత్రికపై అధికారుల్లో చలనం లేదా..?

### విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి



**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మునుగోడు మండల కేంద్రంలోని చండూరు రోడ్డులో సాగుతున్న రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో విద్యుత్ శాఖ మరియు కాంట్రాక్టర్ల ఘోర నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కెనరా బ్యాంక్ సమీపంలో డ్రైనేజీకి అడ్డంగా, రోడ్డు కింది భాగంలో అత్యంత ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ (నియంత్రిక) అధికారుల బాధ్యతారాహిత్యానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.గత కొన్ని రోజుల క్రితమే ఒక నిర్మాణ కార్మికుడు ఈ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల తీవ్ర విద్యుత్ ప్రమాదానికి గురైనా, సంబంధిత అధికారులు “నిమ్మకు నీరెత్తినట్లు” వ్యవహరించడం దారుణం. ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చినా అధికారుల్లో చలనం రాకపోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మార్గంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే సురక్షిత ప్రాంతానికి తరలించాలి. ప్రాణాపాయం ఉందని తెలిసినా పనులు కొనసాగించిన అధికారులపై, కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా విద్యుత్ మరియు ప్రజాధిపత్య అధికారులు తక్షణమే స్పందించి ఈ ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలనీ విన్నవిస్తున్నారు.

# పెద్ది తర్వాత కొత్త సినిమాకు జాన్వీకపూర్ గ్రీన్ సిగ్నల్.. !



దేవర సినిమాతో టాలీవుడ్‌కు గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది బాలీవుడ్ భామ జాన్వీకపూర్. ఈ చిత్రం జాన్వీకపూర్ కు ఆశించిన స్థాయిలో బ్రేక్ ఇవ్వలేకపోయింది. రీసెంట్‌గా రాంచరణ్‌తో కలిసి నటించిన పెద్ది బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. అయితే ఈ మూవీ కూడా జాన్వీకపూర్‌కు అంతగా కలిసి రాలేదు. పెద్దిలో జాన్వీకపూర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలపై తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. భవిష్యత్‌లో ఇలాంటి పాత్రలు చేయొద్దంటూ పలువురు నెటిజన్లు జాన్వీకపూర్‌కు సూచించారు. అయితే జాన్వీకపూర్ నెక్ట్స్ ఎలాంటి ప్రాజెక్టు చేయబోతుందా..? అని ఆసక్తిగా చర్చించుకుంటున్నఅభిమానులు, మూవీ లవర్స్ కోసం క్రేజీ న్యూస్ నెట్టింట వైరల్ అవుతోంది. ఫేం ఉమేశ్ బిస్ట్ డైరెక్టర్‌తో కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది జాన్వీకపూర్. బాలాజీ మోషన్ పిక్చర్స్, సిఖ్య ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఏక్తాకపూర్, గునీత్ మోంగా ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ వచ్చే అక్టోబర్-నవంబర్‌లో సెట్స్‌పైకి వెళ్లనుంది.

# ప్రేమ... వినోదం సంజోష్, రిషిత

సంజోష్ తగరం హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న సినిమా 'మై లవ్'. ఈ చిత్రంలో రిషిత హీరోయిన్‌గా నటిస్తుండగా, మురళీధర్ గౌడ్, తనికెళ్ల భరణి, 'పుష్ప' కేశవ, రచ్చ రవి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తెలంగాణ ఐటీ అండ్ ఇండస్ట్రీస్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమర్పణలో జోష్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా సంజోష్ తగరం మాట్లాడుతూ-- "మీ గతంలో మీరు ఎవరో ఒక అమ్మాయిని ప్రేమించే ఉంటారు. మళ్లీ ఆ అమ్మాయిని గుర్తుకు తెచ్చే సినిమా 'మై లవ్'. ఫీల్ గుడ్ లవ్ ఎంటర్‌టైన్మెంట్ జానర్‌లో డివోషనల్ కాన్సెప్ట్‌తో, ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని ఓ కొత్త పాయింట్‌తో ఈ సినిమా చేస్తున్నాం" అన్నారు. "ఈ సినిమాలోని ఓ లీడ్ రోల్ చేస్తున్నాను" అని చెప్పారు కేశవ. "కొత్త కాన్సెప్ట్‌తో రూపొందిస్తున్న ఈ మంచి సినిమా సక్సెస్ కావాలి. సంజోష్‌గారికి నా బెస్ట్ విషెస్" అన్నారు అతిథిగా హాజరైన హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం.



# డిఫరెంట్ కాన్సెప్ట్ కథ.. ఓ ...సుకుమారి




ఈ వారం ప్రేక్షకులకు వినోదం పంచడానికి వచ్చిన చిత్రం 'ఓ..! సుకుమారి'. కథాబలమున్న సినిమాలతో ప్రయాణం చేసే తిరువీర్ కథానాయకుడు కాగా.. ప్రముఖ కథానాయిక ఐశ్వర్య రాజేశ్ ఆయనతో జోడీ కట్టడం, ప్రచార చిత్రాలూ, సినిమాలోని కాన్సెప్ట్ ప్రేక్షకుల్ని ప్రముఖంగా ఆకర్షించిన అంశాలు. యాదగిరి అలియాస్ యాది (తిరువీర్) పెళ్లికి సిద్ధమవుతాడు. పక్క ఊరిలోని ఓ అమ్మాయిని చూడటానికి వెళ్లి దామిని (ఐశ్వర్య రాజేశ్)పై మనసు పడతాడు. ఆమెనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఆ ఊళ్లో కూడా ఎలాగైనా దామినికి పెళ్లి చేసి సాగనంపాలనేది గ్రామస్తుల ప్లాన్. దానికి కారణం ఆమెకొక విచిత్రమైన సమస్య ఉండటమే. ఆమెను ముట్టుకోగానే షాక్ కొడుతుంది. ఆ సమస్య వల్ల ఊళ్లో వాళ్లు చాలా రకాలుగా ఇబ్బందులు పడుతుంటారు. అందుకే యాది ఇష్టపడటమే ఆలస్యం... ఆ ఊరంతా కలిసి దామిని పెళ్లిని ఘనంగా చేసి సాగనంపుతుంది. అసలు చిక్కులు ఆ తర్వాతే మొదలవుతాయి. ముట్టుకుంటేనే షాక్ కొట్టే దామినితో యాదగిరి కాపురం ఎలా చేశాడు? అత్తారింట్లో దామిని ఎలా కలిసిపోయింది? ఆమెకున్న షాక్ సమస్యని తన భర్త ఊరి జనాలు ఎప్పుడు ఎలా తెలుసుకున్నారు?యాది పెళ్లి చేసుకోవాలనే నిర్ణయం వెనకున్న బలమైన ఆ కారణాలేమిటి?తదితర విషయాల్ని తెరపై చూడాల్సిందే. తిరువీర్ ఇటీవల నటించిన 'పాపం ప్రతాప్'లో కథానాయకుడి పాత్రకు సమస్య ఉంటుంది. అది కూడా భార్యాభర్తల మధ్య కాపురానికి సవాల్‌గా నిలిచిన సమస్యే. ఇందులోనేమో కథానాయికకి సమస్య. ఈ రెండూ కూడా గ్రామీణ నేపథ్యంతో సాగే కథలే. మరికొన్ని సారూప్యతలూ కనిపిస్తాయి. ముట్టుకోగానే షాక్ కొట్టే ఓ అమ్మాయి... అది తెలియక ఆమెని పెళ్లి చేసుకున్న ఓ అబ్బాయి... ఆ ఇద్దరి మధ్య కలిసి కాపురం ఎలా సాగించారన్నది ఆసక్తిని రేకెత్తించే విషయమే. నాయకానాయికలు, నిర్మాతలు వినగానే సినిమా చేయడానికి ఒప్పుకొనేలా ప్రేరేపించే కథాంశమే ఇది. కథానాయికకి ఉన్న సమస్య ప్రపంచంలోనే ఒకరిద్దరికి మాత్రమే ఉన్న అరుదైనదని చెప్పారు. అలాంటప్పుడు ఆ సమస్యతో అంతగా కనెక్ట్ కాలేము. పోనీ, అరుదైన సమస్య కదాని సీరియస్‌గా ఏమైనా దాని గురించి చర్చించారా? అంటే అదీ లేదు. షాక్ సమస్య ఎందుకు వచ్చిందో చెప్పారు కానీ, చివరిలో ఎందుకు రాదో చెప్పలేదు.



# ఇంగ్లీష్ రాదని ఆటపట్టించేవారు!

తన పాఠశాల రోజుల గురించి కథానాయిక భాగ్యశ్రీ బోర్సే ఆసక్తికరమైన విషయాల్ని పంచుకుంది. ఇంగ్లిష్ రాకపోవడంతో అందరూ తనను ఆటపట్టించేవారని, నాటి అవమానాలను సవాలుగా తీసుకొని చదువుల్లో రాణించానని చెప్పుకొచ్చింది. ఇటీవల ఓ కాలేజీ విద్యార్థులతో జరిపిన ముఖాముఖిలో ఆమె ఈ సంగతుల్ని వెల్లడించింది. 'మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో నా బాల్యం గడిచింది. అక్కడే మరాఠీ మీడియం స్కూల్‌లో చదువుకున్నా. కొన్నాళ్ల తర్వాత నాన్న ఉద్యోగరీత్యా మా కుటుంబమంతా నైజీరియాకు షిఫ్ట్ అయ్యాం. అక్కడ ఇంగ్లిష్ మీడియం కావడంతో ఇబ్బందులు మొదలయ్యాయి.జుఽబఙ్మఅశీఅ నాకేమో మరాఠీ, హిందీ తప్ప మరో భాష తెలియదు. ఇంగ్లిష్ రాదని స్కూల్లో అందరూ హేళన చేసేవారు. జోక్స్ వేస్తూ ఆటపట్టించేవారు. అయినా నేను ఏ మాత్రం కుంగిపోలేదు. అవహేళనలను ఛాలెంజ్‌గా స్వీకరించా. కొద్దిరోజుల్లోనే ఇంగ్లిష్‌పై పట్టుసాధించాను. ఆ తర్వాత కొన్నాళ్లకు ఇంగ్లీష్‌లో అనర్గళంగా ప్రసంగించే స్థాయికి చేరుకున్నా. పాజిటివ్ మైండ్‌సెట్‌తో ఉంటే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవొచ్చని నా స్కూల్ డేస్‌లోనే అర్థమైంది' అని చెప్పింది భాగ్యశ్రీ బోర్సే. ఇటీవలే ఈ భామ 'లెనిన్' సినిమాతో కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకుంది



# ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో?

'కేజీఎఫ్'తో రాత్రికి రాత్రి పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు కన్నడ స్టార్ హీరో యశ్. 'హను-మాన్' విజయంతో యావత్ భారతీయ సినిమా దృష్టినే ఆకర్షించారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో యశ్ బిజీగా ఉంటే, రిషబ్‌శెట్టితో పాన్ ఇనిండియా స్థాయిలో 'జై హనుమాన్'ని తెరకెక్కిస్తూ ఆడియన్స్‌లో ఆసక్తిని పెంచుతున్నారు ప్రశాంత్‌వర్మ. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఇటీవలే తన తదుపరి ప్రాజెక్ట్ కోసం యశ్‌ని సంప్రదించారట ప్రశాంత్‌వర్మ. ఈ వార్త నిజమే అయితే.. ఆ సినిమా సౌతిండియన్ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లడం ఖాయమని సినీపండితులు అభిప్రాయపడుతున్నారు. ప్రశాంత్‌వర్మ సినిమాలంటే ఫాంటసీ, మైథలాజికల్ అంశాల మేళవింపుగా ఉంటాయి. మరి యశ్ కోసం ఆయన ఏ తరహా కథను తయారు చేశారో చూడాలి. ప్రస్తుతం వీరిద్దరి మధ్య కథాచర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయట.

# అందుకే షాపు ఓపెనింగ్స్‌కి వెళ్తుంటా : శ్రీలీల

తక్కువ సమయంలోనే ఎక్కువ చిత్రాలు చేసి పాన్ ఇండియా కథానాయకగా పేరు తెచ్చుకున్న నటి శ్రీలీల. ముందు డాక్టర్ అయి ఆ తర్వాత యాక్టర్ అయినా ఈ బ్యూటీ అమెరికా , మెక్సికో జిల్లాలో పుట్టి బెంగళూరులో పెరిగారన్నది తెలిసిందే. కిస్ అనే కన్నడ చిత్రం ద్వారా కథానాయకగా ఎంట్రీ ఇచ్చిన ఈమె ఆ తర్వాత పెళ్లి సందడితో తెలుగులో సందడి చేశారు. ఆ తర్వాత నటించిన ధమాకా చిత్రం మంచి విజయాన్ని అందించింది అంతే ఆపై వరుసగా స్టార్ హీరోలతో నటించే అవకాశాలను అందిపుచ్చుకుంటూ క్రేజీ హీరోయిన్గా రాణిస్తున్నారు. దీంతో ఓపక్క చిత్రాలు నటిస్తూనే మరోపక్క వాణిజ్య ప్రకటనలో నటిస్తూ రెండు చేతుల సంపాదిస్తున్నారు. అంతేకాకుండా షాపుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటూ అభిమానులకు మరింత దగ్గర అవుతున్నారు. పుష్ప 2 చిత్రంలో కిసక్కు అనే ఐటెం సాంగ్లో నటించి కురక్రారును కిర్రెరక్కించారు. ఆ తర్వాత పరాశక్తి చిత్తంతో కోలీవుడ్కు ఎంట్రీ ఇచ్చారు. తాజాగా ఒక హిందీ చిత్రంలో నటిస్తూ పాన్ ఇండియా కథానాయకగా పేరు తెచ్చుకున్నారు. ఇటీవల ఎక్కువగా షాపుల ప్రారంభోత్సవ కార్యక్రమాలు పాల్గొనడం గురించి ఆమె పేర్కొంటూ..'



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.